

అవస్థల్లో ప్రయాణికులు

బాలానగర్ రైల్వేస్టేషన్‌లో వసతులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 8లో ►



ఎస్‌జీఎఫ్ సందడి

మండలాల్లో పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల సందడి నెలకొంది.

వివరాలు 10లో ►

గరిష్టం/కనిష్టం
36.1 /22.6

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఓటరు జాబితాను త్వరగా సిద్ధం చేయాలి



మరికల్: మండలంలో కొత్త ఓటరు జాబితాను త్వరగా సిద్ధం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీఎల్‌ఓలు సేకరించిన ఓటరు జాబితా వివరాలను పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాలో చేర్చాలని, తప్పులు ఉండొందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, డీటీ లతరెడ్డి, ఆర్ఐలు శ్రీశైలం, సుధాకార్‌రెడ్డి, గోపాల్‌రావు పాల్గొన్నారు.

ధన్వాడలో..

ధన్వాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఓటరు తుది జాబితా సిద్ధం చేయడంపై పలు సూచనలు చేశారు. మారోమారు ఓటు జాబితాను సరి చూసుకోవాలని, ఎవరైన మృతి చెంది ఉంటే వారి పేర్లు తొలగించాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ సింధూజ, గాయత్రి తదితరులు ఉన్నారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయం



నారాయణపేట: సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి పాటుపడుతుందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ ఆర్థిక పునరావాస పథకం కింద మంజూరైన రూ.2.50 లక్షల చెక్కులను ఐదు మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులకు వంద శాం సబ్సిడీతో ఆర్థిక సహాయం అందించడంతో వారు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటు జీవనోపాధి పొందుతారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా దివ్యాంగ సంక్షేమం కోసం వారికి చెల్లించే అసరా పింఛన్ రూ.3016 నుంచి రూ.4,016కు పెంచిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందన్నారు. దివ్యాంగ సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి వేణుగోపాల్, బీఆర్ఎస్ నాయకులు శ్రీపాద్, సంపత్‌కుమార్‌దరక్, సురేందర్‌రెడ్డి, హంజరాజ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఏడు దశాబ్దాల్లో 8 మందే..

- ఉమ్మడి జిల్లా నుంచి చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువే
- 14 నియోజకవర్గాల్లో ఏడింటిలో మాత్రమే అతివలకు అవకాశం
- పార్లమెంట్‌లో మహిళా బిల్లు నేపథ్యంలో అంతటా చర్చ
- 33శాతం రిజర్వేషన్ అమలులోకి వస్తే పెరగనున్న అవకాశాలు

మహిళా ఎమ్మెల్యే	నియోజకవర్గం
టి.శాంతాబాయి	మక్తల్, కల్వకుర్తి
జయలక్ష్మీ దేవమ్మ	అలంపూర్
కౌముదినిదేవి	వనపర్తి
డీకే అరుణ	గద్వాల
స్వర్ణసుధాకర్‌రెడ్డి	అమరచింత
సీతాదయాకర్‌రెడ్డి	దేవరకద్ర
షాజహాన్‌బేగం	షాద్‌నగర్
ఎం.ఇందిర	షాద్‌నగర్

సాక్షి, నాగర్‌కర్నూల్: చట్టసభల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పిస్తూ రూపొందించిన బిల్లును కేంద్రమంత్రి వర్గం ఆమోదం తర్వాత లోక్‌సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టగా.. బుధవారం రాత్రి బిల్లు ఆమోదం పలికింది. ఈ నేపథ్యంలో రాజకీయంగా చోటుచేసుకోనున్న పరిణామాలపై సర్వత్రా చర్చ సాగుతోంది. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం 2027 తర్వాతే మహిళలకు రిజర్వేషన్లు అమలయ్యే అవకాశాలు ఉన్నాయి. అలాగే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 14 నియోజకవర్గాల్లో ఇప్పటివరకు 7 నియోజకవర్గాల్లో మాత్రమే మహిళలకు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం దక్కింది. మిగతా ఏడు నియోజకవర్గాల్లోనూ ఒక్కరికి అవకాశం రాలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం ఎనిమిది మంది మాత్రమే మహిళలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో ఒక్కసారి కూడా మహిళా అభ్యర్థి గెలుపొందలేదు. పార్లమెంట్ ఉభయసభలతో పాటు మెజార్టీ రాష్ట్రాల ఆమోదం పొందితే మహిళా బిల్లు అమలులోకి వస్తుంది. 2027 తర్వాత జరిగే ఎన్నికల్లో మహిళా ప్రజాప్రతినిధుల సంఖ్య గణనీయంగా పెరగనుంది.


కౌముదినిదేవి (వనపర్తి)


సీతాదయాకర్‌రెడ్డి (దేవరకద్ర)

- ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 70 ఏళ్లలో మొత్తం 8 మంది మహిళలు మాత్రమే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. మొదటగా 1952లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గం నుంచి టి.శాంతాబాయి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత కల్వకుర్తి నియోజకవర్గం నుంచి 1957, 1964లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు.
- 1957 ఎన్నికల్లో అలంపూర్ నియోజకవర్గం నుంచి జయలక్ష్మి దేవమ్మ కాంగ్రెస్ నుంచి గెలుపొందారు.
- వనపర్తి నియోజకవర్గం నుంచి రాణి కౌముదినిదేవి కాంగ్రెస్ నుంచి 1962, 1967 ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1962 వరకు హైదరాబాద్ తొలి మహిళా నగర మేయర్ గానూ ఆమె పనిచేశారు.
- 1957 ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి షాజహాన్‌బేగం కాంగ్రెస్ తరపున పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
- 1985లో టీడీపీ నుంచి పోటీచేసిన ఎం.ఇందిర సైతం షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అయ్యారు.
- గద్వాల నియోజకవర్గం నుంచి డీకే అరుణ 2004లో సమాజ్‌వాదీ పార్టీ నుంచి 2009, 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీచేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.
- అమరచింత నియోజకవర్గంనుంచి 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి స్వర్ణాసుధాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. నియోజకవర్గ పునర్విభజన తర్వాత అది దేవర కద్రగా మారింది. అనంతరం 2009లో టీడీపీ నుంచి సీతాదయాకర్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో మహబూబ్‌నగర్, జడ్చర్ల, నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లో ఇప్పటివరకు మహిళలు ఎమ్మెల్యేగా ఎన్నిక కాలేదు.


డీకే అరుణ (గద్వాల)


స్వర్ణసుధాకర్‌రెడ్డి (అమరచింత)

2027 తర్వాత అమల్లోకి..

పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొంది రిజర్వేషన్లు అమలులోకి వస్తే, ఈసారి జరుగనున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలే తమకు చివరి అవకాశంగా చాలామంది పురుష అభ్యర్థులు భావిస్తున్నారు. దేశవ్యాప్తంగా జనాభా గణన పూర్తయిన తర్వాత 2027లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టే అవకాశం ఉంది. ఆ తర్వాతే చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ అమలయ్యేందుకు వీలుకానుంది. మొత్తంగా 2028 నాటి లోక్‌సభ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలులోకి వస్తాయని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఈసారి రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో తప్పకుండా తమ సత్తా చాటేలా ఇప్పటికే పురుష అభ్యర్థులు కసరత్తు చేసుకుంటున్నారు. ఆయా పార్టీల్లోని ఆశావహులు ఈసారి రెబల్స్‌గా, ఇండిపెండెంట్‌గా రంగంలోకి దిగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్టు తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్న నియోజకవర్గాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	మహిళా ఆధిక్యం
దేవరకద్ర	1,02,043	1,02,658	615
నారాయణపేట	1,09,304	1,10,491	1,187
మక్తల్	1,13,917	1,16,388	2,471
గద్వాల	1,22,917	1,25,396	2,479
అలంపూర్	1,14,997	1,15,623	626

మత్స్యకారుల సంక్షేమానికి కృషి


సంగంబండ రిజర్వాయర్‌లో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి

మక్తల్: మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, అందులో భాగంగానే ఉచితంగా చేప పిల్లల సీడ్, సబ్సిడీపై వాహనాలు అందజేసిందని ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సంగంబండ చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో సంగంబండ రిజర్వాయర్ మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో 16.50లక్షల చేపపిల్లలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్సకారులందరికీ మెరుగైన కల్పించే ఉద్దేశంతోనే చేప పిల్లలను ఉచితంగా వంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఆలాగే, వలలు, మిగత పరికరాలను పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. రిజర్వాయర్ నుంచి చేపలు పట్టుకొని ఎంతో మంది ఉపాధి పొందుతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ అన్ని కులాలకు సముచితం స్థానం కల్పించడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పి అనిల్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, సంగంబండ రిజర్వాయర్ మత్సకార సంఘం అధ్యక్షుడు తిప్పణ్ణ, నేరడుగాం సర్పంచు అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, శంకర్, రాజు, లక్ష్మికాంత్‌రెడ్డి, సత్యరెడ్డి, డాక్టర్ ఆశప్ప పాల్గొన్నారు.

గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

కృష్ణా: ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు సృష్టించవద్దని, ఎవరైన ఇబ్బందులు కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం మండలంలోని ముడుమాల్, గుడెబల్లూర్‌లోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు, ప్రహరీ, విద్యుత్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజలు శాంతియుతంగా ఉండాలని, అప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఆయన వెంట సీఐ రాంలాల్,ఎస్ఐ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ముడుమాల్‌లోని పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

విఘ్నేశ్వరుడికి ఎస్పీ ప్రత్యేక పూజలు..

నారాయణపేట రూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి బుధవారం ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా హారతి ఇవ్వడంతోపాటు తీర్థ ప్రసాదాలు, అన్నదానం చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధల మధ్య భజనలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించి కొండారెడ్డిపల్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవుడిసా భక్తిబావం పెంపొందించుకోవాలని, ఉత్సవాలను ఆనందోత్సవాలతో నిర్వహించుకోవాలన్నారు. కుల, మత బేదాలు లేకుండా సామరస్య పూర్వకంగా సంబరాలు పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లాలో 1486 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారని, ప్రతి ఒక్కరు తప్పని సరిగా జియో ట్యాగింగ్ చేయించుకోవాలని, ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, సీఐ శ్రీకాంత్‌రెడ్డి, ఆర్ఐ శేఖర్‌బాబు, లలిత, రిజర్వుడ్ పోలీసులు పాల్గొన్నారు.

ముగిసిన ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ పోటీలు


ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో నాయకులు, ఉపాధ్యాయులు

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా రెజ్లింగ్ పోటీలను నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి 130 మంది రెస్లింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 30 కేజీల విభాగంలో సీత మహాలక్ష్మి, 33 కేజీల విభాగంలో నిఖిత, 36 కేజీల్లో శిరిష, 38 కేజీల్లో బాలు నాయక్, 35 కేజీల్లో ఆశోక్, 41 కేజీల్లో శిరాజ్, 46 కేజీల్లో గణేష్ నాయక్ ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. వీరు ఈ నెల 22 నుంచి 24వరకు వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొన డానికి రేపు సాయంత్రం 6 గంటలకు మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ బోనోఫైడ్, ఆధార్, చివరి సంవత్సరం ప్రోగ్రెస్ కార్డు, తీసుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సుధీర్‌రావు, గోవర్ధన్‌గౌడ్, ఉమేష్, హెచ్‌యం రమేష్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, ఏజీఎఫ్ కార్యదర్శి నర్సింహులు, రమేష్, వేణుగోపాల్, పీఈటీలు నెల్సన్, రవికుమార్, రమణ, సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో తీవ్ర నిర్లక్ష్యం

- కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ఆందోళన


కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

నారాయణపేట: తమ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిరసిస్తూ అంగన్‌వాడీ టీచర్లు కలెక్టరేట్‌ను ముట్టడించారు. తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో మున్సిపల్ పార్కు నుంచి ర్యాలీగా బయలుదేరి కలెక్టరేట్ వద్దకు చేరుకున్నారు. మధ్యలోనే పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులను నెట్టుకొని కలెక్టరేట్ గేట్ల వరకు చేరుకొని ధర్నా నిర్వహించారు. గత పది రోజుల పాటు సమ్మె చెస్తుండగా ప్రభుత్వం స్పందించకపోవడం ఏమిటని ప్రశ్నిస్తూ భీష్మించి కూర్చున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి, జిల్లా అధ్యక్షులు శశికళలు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు టీచర్లు, ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్దంగా అంగన్‌వాడీలు సమ్మెలో ఉండగా అధికారులు కేంద్రాల తాళాలను పగలగొడుతున్న అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గేటు దూకేందుకు యత్నం..

గంటన్నరపాటు ధర్నా చేస్తున్నప్పటికి కలెక్టరేట్ నుంచి ఉన్నతాధికారులు ఎవరూ రాకపోవడంతో ఒకరిద్దరు కలెక్టరేట్ గేట్లు నెట్టే ప్రయత్నం చేశారు. దీన్ని పోలీసులు అడ్డుకోవడంతో అగిపోయారు. ఈక్రమంలో పోలీసులు , కార్మిక సంఘాల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న సిఐ రవిబాబు, ఎస్‌బీ సీఐ శ్రీకాంత్‌రెడ్డి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, కార్మిక సంఘం నాయకులతో మాట్లాడి శాంతింపజేశారు. అనంతరం వినతిపత్రం అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, జిల్లా ఉపాధ్యక్షులు పుంజనూరు ఆంజనేయులు, ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి కొండన్న, అశోక్, గోవిందరాజు, జోషి, మంజుల, రమాదేవి, శారధ, రాధ, వసంతబాయి, వరలక్ష్మి, భారతి, రాణి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ గేటు దూకేందుకు యత్నిస్తున్న అంగన్‌వాడీలు


అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘం నాయకులు

మెరుగైన వైద్య సేవలు అందించండి

- వైద్యులు వారంలో ఒక రోజు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే అయ్యేలా అవగాహన కల్పించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట/మాగనూర్/కృష్ణా: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని.. వారానికి ఒక్క రోజు తప్పనిసిరిగా వైద్యులు క్షేత్రస్థాయిలో వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. బుధవారం ఆయన ఎస్పీ వెంకటేశ్వర్లు, అడిషనల్ కలెక్టర్ మయాంక్‌మిట్టల్, ఆర్డీఓ రామస్వామి ఆధ్వర్యంలో మాగనూర్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. సబ్‌సెంటర్ల డాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు ఏఎంసీ చెకప్ ప్రతి నెల నిర్వహించాలని, ప్రతిరోజు ఔట్ పేషంట్‌లతోపాటు గర్భిణులకు కూడా వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. మొదటి నెల ఏఎంసీ చెకప్‌కు వచ్చే గర్భిణి వివరాలను కేసీఆర్ కిట్ యాప్, డాక్టర్ యాప్‌లో నమోదు అయ్యాయా లేదా పరిశీలించాలన్నారు. ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రులలో అయ్యేటట్లు తగు చర్యలు చేపట్టాలని, ఇదిలాఉండగా, గతంలో ఇక్కడ గర్భిణుల ప్రసవాల నిమిత్తం ఏర్పాటు చేసిన కంటైనర్ ఖాళీగా ఉండటంతో కర్ణాటక-తెలంగాణ బోర్డర్ వద్ద ఏర్పాటు చేసే చెక్‌పోస్టు నిమిత్తం అక్కడ విధులు నిర్వహించే సిబ్బంది కోసం ఉపయోగించుకునేందుకు కంటైనర్‌ను తీసుకువెళ్లాలని ఆదేశించారు. సమావేశంలో డాక్టర్ శైలజ, డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ నిధులు బ్యాంకుల్లో జమ..

జిల్లాలో రూ.లక్ష లోపు రుణమాఫీ పథకం సంబంధించి నిధులు బ్యాంకుల్లో జమ చేయడం జరిగిందని కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం రైతు రుణమాఫీ పై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీసీలో వివరించారు. అర్హత గల రైతుల ఖాతాల వివరాలు అందించని వారి వివరాలు సేకరించి పోర్టల్ బ్యాంకుల వారీగా నమోదు చేసేందుకు చర్యలు చేపట్టడంతో పాటు వ్యవసాయ సాగుకు అవసరమైన ఎరువుల నిల్వాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గృహలక్ష్మి అర్హుల ఎంపిక, ఆసరా పింఛన్, ఆయిల్‌ఫాం సాగు, హరితహారం మొక్కలు నాటే లక్ష్యాలు చేరుకునేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. అధికారులు గోపాల్‌నాయక్, జాన్‌సుధాకర్, విజయ్‌కుమార్, వీణావాణి, జ్యోతి, మురళీ, కన్యాకుమారి అధికారులు పాల్గొన్నారు.

‘నీతి అయోగ్’కి నర్వ మండలం ఎంపిక

జిల్లాలోని నర్వ మండలం నీతి అయోగ్ కింద ఎంపికైనందున మండలంలో అన్ని విధాల అభివృద్ధి చేపట్టనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఒక మండలాన్ని ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడంతో నర్వ మండలం ఎంపిక చేయడం జరిగిందన్నారు. నర్వ మండలంలో 10 మంది అధికారుల పర్యవేక్షణలో వ్యవసాయ, పశుపోషణ, వైద్య ఆరోగ్య, అంగన్‌వాడీ, విద్య, తాగునీరు, సెల్ఫ్ హెల్ఫ్ గ్రూప్స్ , గ్రామ అవసరాల పై దృష్టి సారిస్తారని తెలిపారు. ఎస్ఎస్‌జీ సభ్యులు మండల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టు తయారు చేయాలన్నారు.

శాశ్వత పోలీస్ చెక్‌పోస్టు ఏర్పాటు చేయండి

రాష్ట్ర సరిహద్దులో శాశ్వతంగా పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ స్థలం చూడాలని తహసీల్దార్ దయాకర్‌రెడ్డిని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. బుధవారం కృష్ణా మండలం గుడెబల్లూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాష్ట్ర సరిహద్దును ఎస్పీ, అడిషనల్ కలెక్టర్‌తో కలిసి సందర్శించారు. రాబోవు ఎన్నికల నేపథ్యంలో వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి ఉంటుందని, స్థలం ఉంటే పోలీస్ చెక్‌పోస్టుకు భవనం నిర్మిద్దామన్నారు.

క్లుప్తంగా

కాల్వలో పడి రైతు మృతి

మక్తల్: మక్తల్ మండలం చిట్యాలకు చెందిన బలిజె ఈశ్వరప్ప(47) బుధవారం వ్యవసాయ పొలానికి వెళ్తూ.. కర్ని వద్ద సంగంబండ రాజ ర్వాయర్ కాల్వలో పడిపోయాడు. చుట్టు పక్కల వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. వారు వచ్చి చూసే సరికి అతను మృతిచెందాడు. మృతుడి భార్య రాజరాజేశ్వరి ఫిర్యాదు మేరకు మక్తల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పురుగు మందు తాగి వ్యక్తి..

దామరగిద్ద: పురుగు మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు కథనం ప్రకారం.. మండలంలోని విఠలపూర్‌కు చెందిన గౌరగారి కిష్టప్ప(50) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇరుగుపొరుగు వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వారు ఇంటికి చేరుకొని నారాయణపే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కాశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహం అందిజేశారు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గ్రామ పంచాయతీ కార్మికుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవ రెడ్డి వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన బుడుగ జంగం కుర్మన్న(43) స్థానిక గ్రామ పంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం ఈనెల 13న మోపెడ్ వాహనంపై వెళ్తుండగా స్థానిక స్నేహ చికెన్ పరిశ్రమ సమీపంలో గుర్తు తెలియని వాహనం మోపెడ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుర్మన్నకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. కుర్మన్న తమ్ముడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


కుర్మయ్య (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఏఈకి గాయాలు

అయిజ: మున్సిపాలిటీలో ఏఈగా పనిచేస్తున్న గోపాల్ బుధవారం గద్వాల నుంచి అయిజకు కారులో వెళ్తున్నాడు. పరమాల స్టేజీ వద్ద ఇతని కారును వెనుక నుంచి వచ్చి మరో కారు ఢీకొట్టింది. ఏఈ ప్రయాణిస్తున్న కారు వెనుక భాగం పూర్తిగా దెబ్బతినగా.. ఏఈ కి స్వల్ప గాయాలయ్యాయి.

కుటుంబ కలహాలతో టవర్ ఎక్కిన యువకుడు

ఊట్కూరు: మండలంలోని మల్లెపల్లికి చెందిన నర్సింహ కుటుంబ కలహాలతో మల్లెపల్లి స్టేజీ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ గోకరి సంఘటన స్థలానికి చేరుకుని యువకుడిని సంజాయించి కిందకు దించాడు. ఈ విషయమై ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడారు. కుటుంబ కలహాలతో యువకుడు టవర్ ఎక్కాడని, యువకుడికి, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ చేశామని తెలియజేశారు.



ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆయిల్ చోరీ

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారి పక్కనున్న పత్తి మిల్లు వద్ద పంట పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఈ నెల 2న చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలరాజు వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గిరిష్‌బాబు హైదరాబాద్‌లో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన పొలంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లో ఈనెల 2న ఆయిల్ చోరీ చేశారని అతని వద్ద పని చేస్తున్న హలీంబాషా యజమానికి చెప్పాడు. ఈ మేరకు గిరిష్‌బాబు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆలయంలో..

మల్దకల్: మండల కేంద్రంలోని చింతలముని స్వామి, విష్ణుమూర్తి ఆలయంలో హుండీ తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం చోరీకి పాల్పడ్డారు. ఈ విషయమై ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ ఆలయాన్ని పరిశీలించారు. గద్వాల నుంచి క్లూస్ టీంను రప్పించి వేలు ముద్రలు పరిశీలించారు. హుండీలో 15 వేలకు పైగా ఉండవచ్చని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వెయిటింగ్ గది ఉన్నా.. కుర్చీలు లేని వైనం

- ఏళ్లుగా కంకరకే పరిమితమైన బీటీ రోడ్డు
- లోలేవల్ ప్లాట్‌ఫారంతో ఇబ్బందులు
- ఇదీ బాలానగర్ రైల్వేస్టేషన్ దుస్థితి



అసంపూర్తి పనులు.. అవస్థల్లో ప్రయాణికులు

మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌ను ఆధునిక హంగులతో నిర్మించి 2022లో అందుబాటులోకి తీసుకొచ్చారు. సీసీ కెమెరాలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, విశాలమైన వెయిటింగ్ హాల్ నిర్మించారు. నిత్యం ఈ రైల్వేస్టేషన్ నుంచి వందల సంఖ్యలో ప్రయాణికులు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. కాని సరైన రోడ్డు సౌకర్యం, కనీస సౌకర్యాలు కలిఎంచకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే జాతీయ రహదారిపై ఎలాంటి సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో స్టేషన్‌కు ఎలా వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది.

– బాలానగర్

కంకరవేసి బీటీ మరిచారు..



బీటీ రోడ్డు ఏర్పాటుకుగాను 2022లోనే రైల్వే పరిధిలోని స్టేషన్ నుంచి చెరువుకట్ట వరకు కంకరవేసి వదిలేశారు. నేటికీ బీటీ వేయకపోవడంతో పాదచారులు, వాహనదారులు స్టేషన్‌కు రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే రోడ్డు సైతం చెరువుకు ఆనుకొని ఉండటం, ఎలాంటి రక్షణ గోడ నిర్మించకపోవడంతో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంది. రహదారి పొడవునా వీధిదీపాలు ఏర్పాటు చేసినా ఒక్కో స్తంభానికి మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో రాత్రిళ్లు వెలుతురు సరిపడా ఉండటం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

పార్కింగ్‌కు తప్పని పాట్లు..



రైల్వేస్టేషన్‌లో వాహనాల పార్కింగ్ సదుపాయం లేదు. దీంతో ప్రయాణికులు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తున్నారు. పార్కింగ్ లేకపోవడంతో వాహనాలకు భద్రత లేదని రైళ్లలో రాకపోకలు సాగించే ఉద్యోగాలు, రోజువారీ కూలీలు ఆందోళన చెందుతున్నారు. అంతేగాక స్టేషన్ వద్ద కార్లు కూడా మలుపుకోలేని పరిస్థితి ఉండటంతో ప్రయాణికులను కాలనీ రోడ్డులోనే దించి వెళ్తున్నారు.

లోలెవల్ ప్లాట్‌ఫామ్స్..



స్టేషన్‌లో మొత్తం 4 ప్లాట్‌ఫామ్స్ ఉండగా.. అందులో 2, 3 ప్లాట్‌ఫామ్స్ లోలేవల్‌లో ఉన్నాయి. దీంతో ప్రయాణికులు రైలు ఎక్కడానికి, దిగడానికి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆయా ప్లాట్‌ఫామ్స్‌ను శుభ్రం చేయకపోవడంతో గడ్డి, చెత్తా చెదారం పేరుకుపోయింది. కనీసం ట్రైన్ వచ్చే వరకు కూర్చోడానికి కూడా 1వ నంబర్ ప్లాట్‌ఫామ్‌కు వెళ్లాల్సిన పరిస్థితి.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి..

బాలానగర్ స్టేషన్ నుంచి రోజుకు 200 మందికి పైగా ప్రయాణికులు హైదరాబాద్, సికింద్రాబాద్, మహబూబ్‌నగర్, కర్నూలుతో పాటు ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగు కిలో మీటర్ల దూరం ఉన్న కొత్తూరు, తిమ్మాపూర్‌లో నిలిపే తుంగభద్ర, హంద్రీ ఎక్స్‌ప్రెస్‌లను షాద్‌నగర్‌కు 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇక్కడి స్టేషన్‌లో నిలిపితే బాగుంటుంది. దీంతో ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం కూడా ఉంది.



– వాల్యానాయక్, చైర్మన్, రాష్ట్ర గిరిజన కోపరేటివ్ సొసైటీ

పార్కింగ్‌కు ఇబ్బందులు..



నేను తరచూ రైలులో హైదరాబాద్, కర్నూలుకు వెళ్తుంటాను. స్టేషన్‌లో పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో బైక్‌ను నిలిపి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. తిరిగి వచ్చే వరకు వాహనం ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. పార్కింగ్ సదుపాయం కల్పించాలి.

– ఓంప్రకాశ్‌రెడ్డి, రైల్వే ప్రయాణికుడు

ప్లాట్‌ఫాం ఎత్తు పెంచాలి..



మేము తరుచూ హైదరాబాద్‌కు రైలులో వెళ్తుంటాం. పలుమార్లు 3వ నంబర్ ప్లాట్‌ఫాంపైకి రైలు రావడంతో చిన్నపిల్లలు, వృద్ధులతో ఎక్కడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పలువురు కిందపడి గాయాలపాలైన ఘటనలూ ఉన్నాయి. అంతేగాకుండా రైలు వచ్చే వరకు కూర్చుకునేందుకు ఫాట్‌ఫాంపై కుర్చీలు కూడా లేవు. దయచేసి ప్లాట్‌ఫాం ఎత్తు పెంచాలి.

– సాదిఖ్, ప్రయాణికుడు, బాలానగర్

రోడ్డు నిర్మించాలి..



పట్టణం నుంచి రైల్వేస్టేషన్ వరకు రహదారి సౌకర్యం కల్పించాలని ఇక్కడికి వచ్చిన రైల్వే జీఎంకు విన్నవించాం. అంతేగాకుండా తుంగభద్ర, హంద్రీ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలపాలని వినతిపత్రం అందజేశాం. అయినా నేటికీ ఎలాంటి చర్యలు చేపట్ట లేదు.

– విజయలక్ష్మి, సర్పంచ్, బాలానగర్

రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలి..



ట్రైన్ టికెట్లు బుక్ చేసుకోవాలంటే పనులు మానుకొని 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న షాద్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తుంది. ఒకరోజు సమయం కూడా వృథా అవుతుంది. ఇటీవలే కొత్త భవనాన్ని నిర్మించినా రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయలేదు. రైల్వే ఉన్నతాధికారులు దృష్టి సారించి స్థానిక ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

– కల్యాణి, జెడ్పీటీసీ సభ్యురాలు, బాలానగర్

'ఒకే చోట తిష్ట' కథనంపై చర్చ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కలెక్టరేట్ కార్యాలయంలో కొంత మంది అధికారులు చాలా కాలంగా ఒకే స్థానంలో తిష్ట వేశారని 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై చర్చ జరిగింది. ఆయా సెక్షన్ల అధికారులు కథనంపై చర్చించుకోవడం కనిపించింది. కొందరి నుంచి మాపై అబండాలు వస్తున్నాయని ఇతర అధికారులు గుసగుసలు ఆడుకున్నారని సమాచారం. కలెక్టర్ రవి నాయక్ ఈ కథనంపై ఆరా తీసినట్లు సమాచారం. వారిని బదిలీలు చేయవచ్చనే ప్రచారం కలెక్టరేట్ ఉద్యోగ వర్గాల్లో చర్చ జరుగుతుందని తెలుస్తుంది.

సర్వీస్ పుస్తకాల పరిశీలన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇందులో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాలలో ఉపాధ్యాయుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు. గతంలో రెండుసార్లు ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులకు కౌన్సిలింగ్ నిర్వహించిన క్రమంలో ఆసక్తి చూపని సుమారు 20 మంది ఉపాధ్యాయుల నుంచి లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నారు. పలువురు ఉపాధ్యాయుల సర్వీస్ పుస్తకాలు సైతం పరిశీలించారు.

ఎస్సీ, ఎస్టీ మహిళల వాటా తేల్చాలి..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదిస్తున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు ఎంతశాతం వాటా ఉంటుందో కేంద్రం స్పష్టతనివ్వాలని బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. బీసీల రిజర్వేషన్లు 27 శాతం నుంచి 54 శాతానికి పెంచాలన్న డిమాండ్ ఏళ్లుగా వినిపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఆగమేఘాల మీద 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించిందని పేర్కొన్నారు.

అన్నపై తమ్ముడు దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లకు చెందిన అన్నదమ్ములు భాస్కర్, శ్రీనుల మధ్య ఇంటి భాగపరిష్కారంలో కొన్ని రోజుల నుంచి తగాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై ఇద్దరి మధ్య మాటమాట పెరిగి తమ్ముడు శ్రీను అన్న భాస్కర్ తలపై కర్రతో బలంగా కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు భాస్కర్‌ను జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల ఐదుగురి దుర్మరణం


చిన్నయ్య (ఫైల్)

అమరచింత: ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతిచెందారు. బైక్, డీసీఎం ఢీకొని అమరచింత మండలం నందిమళ్ల క్రాస్‌రోడ్డుకు చెందిన ఎరుకలి చిన్నయ్య (39) మృతిచెందినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. బుధవారం చిన్నయ్య బైక్‌పై అమరచింతకు వస్తుండగా మక్తల్‌కు చేప పిల్లలను తరలిస్తున్న డీసీఎం ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నయ్య తలకు బలమైన గాయం కావడంతో వెంటనే అంబులెన్స్‌లో ఆత్మకూర్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. చిన్నయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

దైవ దర్శనానికి వెళ్తూ కర్ణాటక వాసి..

నారాయణపేట రూరల్: మల్లన్న దర్శనానికి వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటక బిజాపూర్ తాలూకా హొన్నళ్లికి చెందిన ఆరుగురు మూడు బైక్‌లపై ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలానికి బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు బయలుదేరారు. మార్గమధ్యంలో నారాయణపేట మండలం కొల్లంపల్లి స్టేజీ సమీపంలో మహబూబ్‌నగర్ వైపు నుంచి వచ్చిన కారు ఒక బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్ (40) తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతిచెందగా.. వెనక కూర్చున్న మల్కప్పకు గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సోదరుడు కాజన్న ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కారు డ్రైవర్ షేక్ అజీమోద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జయప్రసాద్ వివరించారు.


ఘటన స్థలంలో బైక్, అశోక్ మృతదేహం

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు..


శాంతమ్మ(ఫైల్)

మరికల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున మరికల్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జోగు శాంతమ్మ(68) మానసికంగా బాగోలేదు. తెల్లవారుజామున జాతీయ రహదారిపై వెళ్తుండగా.. వెనుకాల నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలు అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహం గుర్తుపట్టన్నట్లుగా చిద్రమైపోయింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలియజేశారు.

హైదరాబాద్‌లో విద్యార్థి..


అనిల్ కుమార్‌రెడ్డి (ఫైల్)

అయిజ: మండల కేంద్రంలో నివాసముంటున్న పుల్లారెడ్డి కుమారుడు అనిల్ కుమార్ రెడ్డి(22) హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనిల్ కుమార్‌రెడ్డి హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. అయితే ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ అనిల్ కుమార్ రెడ్డి మంగళవారం రాత్రి మృతిచెందాడు. బుధవారం అనిల్ కుమార్‌కు ఆయన సొంత గ్రామం రాజోళి మండలంలోని పచ్చర్లలో అంత్యక్రియలు నిర్వహించారు.

ట్రాక్టర్ ఢీకొని మహిళ..

మహబూబ్‌నగర్ క్రైం: రోడ్డు పక్కనే సీతాఫలం పండ్లు విక్రయిస్తున్న మహిళను ట్రాక్టర్ ఢీకొట్టడంతో మృతి చెందడంతో పాటు మరో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు అయ్యాయి. టూటౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం..గండేడ్ మండల పరిధిలోని రుసుంపల్లికి చెందిన వల్లపు చెన్నమ్మ(50) బుధవారం జిల్లా కేంద్రంలోని మోనప్పగుట్ట రోడ్డు మార్గంలో సీతాఫలం పండ్లు విక్రయిస్తోంది. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన ఏపీ 22ఎక్స్5432 నంబర్ కలిగిన ట్రాక్టర్ డ్రైవర్ శివశంకర్ వేగంగా ట్రాక్టర్‌తో ఢీకొట్టడంతో తీవ్ర రక్త గాయాలయ్యాయి. దీంతో చికిత్స కోసం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అదేవిధంగా ద్విచక్ర వాహనంపై నిలబడిన దేవదాస్ అనే వ్యక్తికి సైతం గాయాలయ్యాయి. మృతురాలి భర్త వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

వర్గీకరణకు మద్దతిచ్చే పార్టీలకు బుద్ధి చెబుతాం



ఢిల్లీలో ధర్నా చేస్తున్న మాల మహానాడు నాయకులు

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

మహబూబ్‌నగర్ రూరల్: తెలుగు రాష్ట్రాల్లో ఎస్సీ వర్గీకరణకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో మాలలు తగిన బుద్ధి చెబుతారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను దేశవ్యాప్తంగా 30 కోట్ల దళితులు వ్యతిరేకిస్తున్నారని.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నామని వివరించారు. అయితే ఈ రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బీజేపీకి కర్ణాటక రాష్ట్రంలో పట్టిన గతే తెలంగాణలోనూ పడుతుందని హెచ్చరించారు. నూతన పార్లమెంట్ భవనానికి డా. బీఆర్ అంబేడ్కర్ పేరు పెట్టాలన్నారు. ధర్నాలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి ఎడ్ల కృష్ణయ్య, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కానుగడ్డ యాదయ్య, కార్యనిర్వాహక అధ్యక్షుడు రాములు తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లిలో వినాయక నిమజ్జనం

ఎరవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిధిలోని బీచుపల్లి కృష్ణానదిలో బుధవారం భక్తులు గణనాథులను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో వివిధ సంఘాల ఆధ్వర్యంలో గణనాథులను మండపాలల్లో ప్రతిష్టించి నిత్యం భక్తిశ్రద్ధలతో పిల్లలు, పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ ఉదయం సాయంత్రం వినాయకుడికి ఇష్టమైన పిండి వంటలను వండి నైవేద్యంగా సమర్పించి చిన్నారులు, మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు కావడంతో నిమజ్జనం కోసం గ్రామాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకొని సాయంత్రం మండపాల వద్ద లడ్డూ వేలం నిర్వహించారు. అనంతర యువకులు గణనాథుని ఆలాపనలు చేస్తూ చిందులేస్తూ.. వాహనాల్లో బీచుపల్లి కృష్ణానదికి చేరుకున్నారు. అనంతరం గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం దృష్ట్యా బీచుపల్లి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వివిధ శాఖల అధికారులంతా అప్రమత్తమయ్యారు. బీచుపల్లి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఇటిక్యాల ఎస్‌ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించారు.


నిమజ్జనానికి గణనాథులను తీసుకొస్తున్న భక్తులు

ముగిసిన శ్రావణమాస విశేషోత్సవాలు

- హనుమద్దాసుల మండపంలో ముగింపు పూజలు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని హనుమద్దాసుల మండపంలో బుధవారం శ్రావణమాస విశేషోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. గత నెల 2న స్వామి వారి విశేషోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఏటా దేవస్థానంలో నెల రోజుల పాటు వివిధ పూజా కార్యక్రమాలతో పాటు రోజు ప్రత్యేక శాంతిహోమం నిర్వహిస్తారు. విశేషోత్సవాల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. వెయ్యి తులసి దళాలతో ప్రత్యేక అర్చన, ప్రత్యేక శాంతి హోమం నిర్వహించారు. ముగింపు వేడుకల సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా జరిగింది. దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారితో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.


శాంతిహోమం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్

మైసమ్మ ప్రసాదం టెండర్ రూ.18 లక్షలు


మైసమ్మ దేవాలయంలో ప్రసాదాల విక్రయ టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

నవాబుపేట: మైసమ్మ దేవాలయంలో ప్రసాదాలు విక్రయించే టెండర్లు బుధవారం నిర్వహించారు. 15 మంది వేలం పాటలో పాల్గొని టెండర్లు వేయగా.. కాకర్లపహడ్‌కి చెందిన ముర్గని బాలకిష్టయ్య రూ.18.01లక్షలకు టెండర్ దక్కించుకున్నారు. గురువారం (నేడు) నుంచి వచ్చే ఏడాది సెప్టెంబర్ వరకు దేవాలయంలో లడ్డు, పులిహోర ప్రసాదాలు విక్రయించుకోవాల్సి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కాగా గతేడాది రూ.13లక్షలు పలికిన టెండర్ తాజాగా రూ.5లక్షలు ఎక్కువ రావడం విశేషం. టెండర్ ప్రక్రియలో దేవాలయ అధికారి మధనేశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ఆలయ చైర్మన్ కృష్ణయ్య, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వీణ, సర్పంచ్ జంగమ్మ, నర్సింహులు, గోపాల్, మాదవులు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ కుంభకోణం బాబు ఆలోచనల నుంచే

అంతిమ లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన సంబంధీకులే

ఆయన నుంచి మరింత సమాచారాన్ని రాబట్టాల్సి ఉంది..
పోలీసు కస్టడీకి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావట్లేదు
నిందితుడు న్యాయస్థానాన్ని శాసించలేడు
5 రోజులు పోలీసు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును అభ్యర్థించిన సీఐడీ న్యాయవాదులు
కోర్టును శంకించేలా కౌంటర్ దాఖలు చేసిన చంద్రబాబు న్యాయవాదులు
కేసును తాము విచారించడంపై అభ్యంతరం ఉందా? అని ప్రశ్నించిన న్యాయస్థానం
తాము సర్టిఫై చేయాల్సిన అవసరం లేదన్న బాబు న్యాయవాదులు
నేడు తీర్పు వెలువరిస్తామన్న న్యాయస్థానం

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో మాజీ సీఎం చంద్రబాబు నుంచి మరింత సమాచారాన్ని రాబట్టేందుకు ఐదు రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలంటూ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌లో వాదనలు ముగిశాయి. దాదాపు మూడున్నర గంటల పాటు వాదనలు విన్న ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం దీనిపై గురువారం తీర్పు వెలువరిస్తామని ప్రకటించింది. అంతకు ముందు సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ చంద్రబాబు ఆలోచనల నుంచే స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం పుట్టిందని కోర్టుకు నివేదించారు. దీనికి సంబంధించిన ప్రతి విషయం ఆయనకు తెలుసని, ఈ కుంభకోణంలో అంతిమ లబ్ధిదారులు చంద్రబాబుతో పాటు ఆయనకు సంబంధించిన వ్యక్తులేనని నివేదించారు. తమ వద్ద ఉన్న ఆధారాలను దగ్గర పెట్టుకుని చంద్రబాబును విచారించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంత పెద్ద కుంభకోణంలో 24 గంటల్లో దర్యాప్తు పూర్తి చేయడం సాధ్యం కాదన్నారు. చంద్రబాబును తాము (సీఐడీ) విచారిస్తే ఆయనకు వచ్చిన నష్టం ఏమీ ఉండదని, అదే తాము విచారించకుంటే దర్యాప్తునకు తీరని నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. పోలీసు కస్టడీకి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి కాబట్టే చంద్రబాబు పోలీసు కస్టడీని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. నిందితుడు కోర్టును అలా చేయడానికి వీల్లేదు, ఇలా చేయడానికి వీల్లేదని శాసించలేడన్నారు. నిందితుడు ముందు న్యాయం మొకరిల్లరాదని, ఒకవేళ అలా జరిగితే వ్యవస్థ కుప్పకూలినట్లేనన్నారు. విచారణలో మౌనంగా ఉండే హక్కు నిందితుడికి ఉందని, అయితే విచారణకు సహకరించాల్సిన బాధ్యత కూడా నిందితుడిపై ఉందని కోర్టుకు నివేదించారు. ఈ కుంభకోణాన్ని రాజకీయ కారణాలతో వెలికి తీసినట్లు చంద్రబాబు న్యాయవాదులు చెబుతున్నారని, వాస్తవానికి దీన్ని పుణె జీఎస్టీ అధికారులు వెలికి తీశారని తెలిపారు. ఈ కుంభకోణానికి సంబంధించిన వివరాలను జీఎస్టీ అధికారులు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం (టీడీపీ సర్కారు) దృష్టికి తెచ్చారని, కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఎలా దారి మళ్లించారో వివరించారని చెప్పారు. అప్పటి చంద్రబాబు ప్రభుత్వం నామమాత్రపు చర్యలతో జీఎస్టీ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని తొక్కిపెట్టిందని తెలిపారు. ఆ తరువాత షెల్ కంపెనీల గుట్టు రట్టు కావడంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి వాటితో సంబంధం ఉన్న వారందరికీ నోటీసులు జారీ చేశాయని చెప్పారు. ఐటీ శాఖ నోటీసులు ఇవ్వగానే చంద్రబాబుకు అత్యంత సన్నిహితులైన ఇద్దరు వ్యక్తులు విదేశాలకు పారిపోయారని కోర్టు దృష్టికి తెచ్చారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న ఇలాంటి కేసును రాజకీయ ప్రేరేపితం, కక్ష సాధింపు అనడం దారుణమన్నారు. చంద్రబాబు పాత్రకు సంబంధించిన ఆధారాలను సేకరించేందుకు ఒకటిన్నర సంవత్సరం పట్టిందని, దీన్ని బట్టి ఎంత పకడ్బందీగా ఈ కుంభకోణానికి వ్యూహరచన చేశారో అర్థం చేసుకోవాలని కోర్టును కోరారు. చంద్రబాబును విచారణ నిమిత్తం తమ కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థించారు.

మేం సర్టిఫై చేయాల్సిన అవసరం లేదు..

ఏసీబీ కోర్టు కేసు విచారణ మొదలు కాగానే సీఐడీ కస్టడీ పిటిషన్‌లో చంద్రబాబు దాఖలు చేసిన కౌంటర్‌ను పరిశీలించింది. అందులో కోర్టును శంకించేలా పేర్కొన్న అంశాలపై అభ్యంతరం తెలిపింది. చంద్రబాబు న్యాయవాదుల తీరుతో ఒకింత మనస్తాపం చెందిన కోర్టు.. ఈ కేసును తాము విచారించడంపై మీకేమైనా అభ్యంతరం ఉందా? అంటూ సీఐడీ న్యాయవాదులను ప్రశ్నించింది. నిబంధనల ప్రకారం విచారణ జరుపుతున్న నేపథ్యంలో తమకు అభ్యంతరం లేదని సీఐడీ న్యాయవాదులు చెప్పారు. ఇదే ప్రశ్నను చంద్రబాబు తరఫు న్యాయవాదులను కోర్టు అడిగినప్పటికీ వారు మౌనంగా ఉన్నారు. అయినప్పటికీ కోర్టు మరోసారి అడగటంతో.. తాము సర్టిఫై చేయాల్సిన అవసరం లేదంటూ చంద్రబాబు తరఫు న్యాయవాదులు ఒకింత తీవ్ర స్వరంతో బదులిచ్చారు. దీంతో కోర్టు విచారణను ప్రారంభించింది.

ఇప్పుడు కస్టడీ కోరడం ఏమిటి?

చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ.. ఇప్పటికే అన్ని ఆధారాలు సేకరించామని, వాటి ఆధారంగా చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపాలని సీఐడీ మొదటి రోజే కోర్టును కోరిందని పేర్కొన్నారు. అన్ని ఆధారాలు సేకరించినప్పుడు ఇప్పుడు తిరిగి పోలీసు కస్టడీకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఏముందన్నారు. స్కిల్ కేసులో 2021లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, 2023లో చంద్రబాబును అరెస్టు చేసిందని, ఇంత కాలం సీఐడీ ఏం చేస్తున్నట్లని ప్రశ్నించారు. వారి అలసత్వానికి చంద్రబాబును కస్టడీకి కోరడానికి వీల్లేదన్నారు. 45 ఏళ్లుగా చంద్రబాబు కాపాడుకుంటూ వచ్చిన ప్రతిష్టను కాలరాసేందుకే సీఐడీ ఆయన్ను కస్టడీకి ఇవ్వాలని కోరుతోందన్నారు. సిట్ కార్యాలయంలో చంద్రబాబును విచారిస్తున్న సమయంలో దర్యాప్తు అధికారులు ఆ వివరాలను మీడియాకు లీక్ చేశారని తెలిపారు. చంద్రబాబు ఎమ్మెల్యే కాబట్టి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఈ కేసు మొత్తం ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కేసును విచారించే పరిధి ఏసీబీ కోర్టుకు లేదన్నారు.

పరిధి లేకుంటే ఎందుకీ పిటిషన్లు?

దీనికి సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ సుధాకర్‌రెడ్డి, స్పెషల్ పీపీ వివేకానంద తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టులు.. ప్రజా ప్రతినిధులు నిందితులుగా ఉన్న కేసుల్లో చార్జిషీట్ దాఖలైన తరువాత ట్రయల్ మొదలు పెట్టి విచారణ కొనసాగించేందుకు మాత్రమే ఉద్దేశించినవన్నారు. రిమాండ్ విషయంలో ఆ కోర్టులు జోక్యం చేసుకోలేవన్నారు. ఒకవేళ ఏసీబీ కోర్టుకు విచారణ పరిధి లేదని భావిస్తే ఆ విషయాన్ని మొదటే చెప్పి ఉండాల్సిందన్నారు. ఏసీబీ కోర్టుకు విచారణ పరిధి లేకుంటే హౌస్ రిమాండ్, బెయిల్, మధ్యంతర బెయిల్ ఇలా ఇన్ని పిటిషన్లు ఎలా దాఖలు చేస్తారని ప్రశ్నించారు. ఒకవైపు పరిధి లేదంటూనే మరో వైపు ఇన్ని పిటిషన్లు వేయడం చంద్రబాబు తీరును తెలియచేస్తోందన్నారు.

ఆ దృశ్యాలతో మాకేం సంబంధం లేదు..

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. విచారణ దృశ్యాలు మీడియాలో రావడంపై ప్రశ్నించింది. ఆ దృశ్యాలను తాము లీక్ చేశామంటున్న చంద్రబాబు న్యాయవాదులు అందుకు ఆధారాలుంటే చూపాలని సీఐడీ స్పెషల్ పీపీ వివేకానంద కోరారు. ఆ దృశ్యాలు మీడియాలో ఎలా వచ్చాయో, వాటిని ఎవరు చిత్రీకరించారో తమకు తెలియదన్నారు. విచారణ రోజు చంద్రబాబును ఆయన కుటుంబ సభ్యులు, సహాయకులు కూడా కలిశారని కోర్టు దృష్టికి తెచ్చారు.

విశాఖలోనూ సీఎం క్యాంపు కార్యాలయం

- దసరా పండుగ రోజున అక్కడి నుంచి పరిపాలనకు శ్రీకారం
- మంత్రులతో స్పష్టం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన ఎప్పుడు మొదలవుతుందనే అంశంపై కొంత కాలంగా సాగుతున్న చర్చకు సీఎం వైఎస్ జగన్ తెరదించారు. విశాఖపట్నంలోనూ సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసి, దసరా నుంచి పరిపాలన ప్రారంభిద్దామని మంత్రులతో స్పష్టం చేశారు. సీఎం కార్యాలయం మొదలు వివిధ శాఖల కార్యాలయాల ఏర్పాటుకు భవనాలను గుర్తించేందుకు అధికారులతో ఒక కమిటీ వేస్తామని చెప్పారు. ఇక్కడి నుంచి విశాఖపట్నంకు కార్యాలయాల తరలింపునకు అధికారులతో మరో కమిటీ వేస్తామన్నారు. దసరాలోగా కార్యాలయాలను తరలించి.. పండుగ రోజునే విశాఖ కేంద్రంగా పరిపాలన మొదలు పెడతామని చెప్పారు. వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో బుధవారం సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. ఎజెండాలోని అంశాలపై చర్చ ముగిశాక సమావేశం నుంచి అధికారులు నిష్క్రమించారు. ఆ తర్వాత మంత్రులతో సీఎం వైఎస్ జగన్ సమకాలీన రాజకీయ పరిస్థితులపై చర్చించారు. దసరా విశాఖపట్నంలోనే జరుపుకుందామని సీఎం వైఎస్ జగన్ చెప్పారు. ఆ రోజు నుంచి విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన మొదలు పెడతామనడంతో మంత్రులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



చర్చావేదికలో మాట్లాడుతున్న దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం తొలి వీసీ సత్యనారాయణ

న్యాయ ప్రక్రియ అందరికీ సమానమే

- కొందరు దీన్ని పక్కదారి పట్టిస్తున్నారు
- 'స్కిల్'స్కామ్‌లో జీఎస్టీదే ఎక్కువ పాత్ర
- అవినీతిపై పక్కా ఆధారాలతోనే చంద్రబాబు అరెస్టు
- 'రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్'చర్చావేదికలో న్యాయ నిపుణులు

సాక్షి, విశాఖపట్నం: రాజ్యాంగం ప్రకారం న్యాయ ప్రక్రియ అందరికీ సమానమేనని, కానీ ఉన్నత స్థానాల్లో ఉన్న కొందరు దీన్ని పక్కదారి పట్టిస్తున్నారని న్యాయ నిపుణులు పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో పక్కా ఆధారాలతోనే మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు జరిగిందని స్పష్టం చేశారు. న్యాయ వ్యవస్థపై గానీ, న్యాయమూర్తులపై గానీ విమర్శలు చేయడం తగదన్నారు. 'రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్ లైఫ్'అనే అంశంపై వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం విశాఖలో చర్చా వేదిక నిర్వహించారు. దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎల్‌యూ) తొలి వైస్ చాన్స్‌లర్ వై.సత్యనారాయణ మాట్లాడుతూ అత్యాశ ఒక స్థాయి దాటిపోతే అవినీతికి దారితీస్తుందని, ఇది సమాజానికి పెను ప్రమాదమన్నారు. కొందరు ప్రముఖులు తమ పీఏలు, అనుచరుల ద్వారా అవినీతికి పాల్పడుతున్నారని డీఎస్ఎల్‌యూ తొలి రిజిస్ట్రార్ ఎ.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఒక ప్రముఖ ప్రజాప్రతినిధి అవినీతి కేసులో అరెస్టయితే నిరసనలు, ఆందోళనలు చేపడుతున్నారని, అదే సామాన్యుడి విషయంలో మాత్రం అలా జరగదన్నారు. ప్రధాని స్థాయి నుంచి సామాన్యుడి వరకు రూల్ ఆఫ్ లా ఒకేలా ఉండాలన్నారు. రూల్ ఆఫ్ లా కొంతమందికి అర్థం కావడం లేదని, అర్థమైన వారు కులాలు, పార్టీలుగా విడిపోతున్నారని చెప్పారు. అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై ఎన్నో కేసులున్నా అక్కడ ఆందోళనలు జరగడం లేదని గుర్తు చేశారు. ప్రస్తుత అధ్యక్షుడు బైడెన్ కుమారుడిపై కూడా అసత్య సమాచారం ఇచ్చారంటూ కేసు నమోదైందని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో సీఐడీ కంటే జీఎస్టీ పాత్రే ఎక్కువగా ఉందన్నారు. సీఐడీ అన్ని ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేసి రూల్ ఆఫ్ లాను పాటిస్తే ఒకవర్గం మీడియా, ఒక సామాజికవర్గం కక్ష సాధింపు అంటూ దుష్ప్రచారం చేస్తోందని సీనియర్ న్యాయవాది పాకా సత్యనారాయణ పేర్కొన్నారు. రూల్ ఆఫ్ లా విషయంలో పాలకులు, గత పాలకులు, ప్రజాప్రతినిధులు అతీతులు కారని వైజాగ్ ఇంటెలెక్చువల్ ఫోరం ప్రెసిడెంట్, యూపీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ కేఎస్ చలం స్పష్టం చేశారు. అవినీతి కేసుల్లో పలువురు మాజీ సీఎంలు అరెస్టయ్యారని, చంద్రబాబు అరెస్టు కొత్త కాదని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జి.సుబ్బారావు పేర్కొన్నారు.

బాబు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా

సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద జరిగిన విధ్వంసానికి సంబంధించి ముదివేడు పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేశ్‌రెడ్డి బుధవారం విచారణ జరిపారు. అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నందున విచారణను గురువారానికి వాయిదా వేయాలని ఆయన తరఫు జూనియర్ న్యాయవాది కోర్టును కోరారు. శుక్రవారానికి వాయిదా వేయాలని చంద్రబాబు తరఫు న్యాయవాది కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. యుద్ధభేరి పేరుతో చంద్రబాబు చేపట్టిన సాగు నీటి ప్రాజెక్టుల సందర్శన సందర్భంగా అన్నమయ్య జిల్లా అంగళ్లు వద్ద టీడీపీ శ్రేణులు విధ్వంసానికి దిగాయి. ఈ విధ్వంసాన్ని చిత్తూరు జిల్లా పుంగనూరు వరకు కొనసాగించాయి. పుంగనూరు ఘటనలో 40 మందికి పైగా పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసులో చంద్రబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డికి 12 రోజులు మధ్యంతర బెయిల్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అరెస్టయిన వైఎస్ భాస్కర్‌రెడ్డికి హైదరాబాద్ ప్రత్యేక సీబీఐ న్యాయస్థానం 12 రోజుల మధ్యంతర బెయిల్‌కు అనుమతిచ్చింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని, 15 రోజుల పాటు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరుతూ భాస్కర్‌రెడ్డి ప్రత్యేక సీబీఐ కోర్టులో ఈనెల 9న పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇరు పక్షాల వాదనలు ముగియడంతో సీబీఐ కోర్టు బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. భాస్కర్‌రెడ్డికి వైద్య పరీక్షల నిమిత్తం ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి వచ్చే నెల 3వ తేదీ ఉదయం 10.30 గంటల వరకు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్‌లో ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు అనుమతిచ్చింది. ఈ 12 రోజులు నగరం విడిచి వెళ్లకూడదని స్పష్టం చేసింది. ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌తో ఎస్కార్ట్ ఇవ్వాలని జైలు సూపరింటెండెంట్‌ను ఆదేశించింది. ఈ నెల 22న భాస్కర్‌రెడ్డిని ఎస్కార్ట్ పోలీసులకు అప్పగించాలని తెలిపింది. అలాగే వచ్చే నెల 3న ఎస్కార్ట్ పోలీసులు జైలు సిబ్బందికి తిరిగి ఆయన్ని అప్పగించాలని ఆదేశించింది.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆవిరి రూపంలో 119 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 731 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 850 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 3,695 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.255 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో 854.3 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం 854.3 అడుగుల వద్ద 90.1364 టీఎంసీల నీటినిల్వ ఉంది. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వార 3,000, మల్యాల ఎత్తిపోల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 2,180, ముచ్చుమర్రి నుంచి కెసి.కెనాల్‌కు 245, రేగుమానగడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 2,400 క్యూసెక్కుల నీటిని వదిలారు. భూగర్భ కేంద్రంలో 0.835 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసి 1,590 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదిలారు. జలాశయంలో 197 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

రామన్‌పాడుకు 1,880 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో బుధవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వద్వారా 1,030 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్‌టీఆర్ కాల్వ ద్వారా వ్యవసాయ అవసరాల కోసం 950 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 10 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భీమా–2 ద్వారా 848 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ రనీల్ రెడ్డి తెలిపారు.

కోయిల్‌సాగర్ నీటిమట్టం 31.2 అడుగులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం బుధవారం సాయంత్రం వరకు 31.2 అడుగులకు చేరింది. ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. రెండో విడత కింద ఆదివారం నుంచి నీటిని వానాకాలం పంటలకు వదులుతున్నారు. నీటి విడుదలకు ముందు 31.9 అడుగుల మేర ఉన్న నీటి మట్టం 0.7 అడుగుల మేర తగ్గింది. వానాకాలం పంటలు పూర్తి అయిన తరువాత ప్రాజెక్టును జూరాల నీటితో నిండుగా నింపితే యాసంగి పంటలకు సాగు నీరందే అవకాశం ఉంటుంది.

పాఠశాల స్థాయిలో ఎస్‌జీఎఫ్ సందడి

- ఉత్సాహంగా మండల క్రీడలు
- మూడేళ్ల తర్వాత కొనసాగుతున్న పోటీలు
- త్వరలో జిల్లా, ఉమ్మడి జిల్లా క్రీడలకు సన్నాహాలు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరోనా మహమ్మారితో మూడేళ్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల నిర్వహణకు విఘాతం ఏర్పడింది. ఈ ఏడాది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు ఉమ్మడి జిల్లాలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మొదట మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు నిర్వహిస్తున్నారు. ఎస్‌జీఎఫ్ క్రీడలతో పాఠశాల స్థాయిలో క్రీడల సందడి నెలకొంది. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో వేలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

మండల స్థాయిలో చివరిదశకు..

మండలాల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు చివరి దశకు చేరాయి. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నారు. మండల స్థాయిలో ఎంపికైన జట్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. మూడు, నాలుగు రోజుల్లో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా స్థాయిల్లో సెలక్షన్స్ అనంతరం ఉమ్మడి జిల్లా పరిధిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో ఐదు జిల్లాల ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శులు సమావేశమై ఉమ్మడి జిల్లాలో ఎక్కడెక్కడ ఏయే క్రీడలు నిర్వహించాలనే దానిపై చర్చించుకుని షెడ్యూల్ రూపొందించుకున్నారు. ఉమ్మడి జిల్లా కబడ్డీ అండర్–14 బాల, బాలికల పోటీలు వనపర్తి, కబడ్డీ అండర్– 17 విభాగం మహబూబ్‌నగర్, ఖోఖో అండర్–14 బాలురు మహబూబ్‌నగర్ (రాజాపూర్), బాలికలు (గద్వాల), ఖోఖో అండర్–17 విభాగం వనపర్తి, వాలీబాల్ అండర్–14, వాలీబాల్ అండర్–17 విభాగాలు వనపర్తి/ మహబూబ్‌నగర్/ నారాయణపేట, ఫుట్‌బాల్ అండర్–14 విభాగం గద్వాల, ఫుట్‌బాల్ అండర్–17 విభాగం మహబూబ్‌నగర్ (జడ్చర్ల), క్రికెట్ అండర్–14 విభాగం మహబూబ్‌నగర్ (జడ్చర్ల), క్రికెట్ అండర్–17 విభాగం గద్వాలలో పోటీలు నిర్వహించనున్నారు.



అడ్డాకులలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

ఉమ్మడి జిల్లాలో రాష్ట్ర స్థాయి టోర్నీలు

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది పది స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి క్రీడా టోర్నీలు నిర్వహించనున్నారు. వాలీబాల్ అండర్–14 విభాగం బాల, బాలికల టోర్నీ రాజాపూర్, అండర్–17 బాల, బాలికల ఫుట్‌బాల్, అండర్–14 బాల, బాలికల క్రికెట్ టోర్నీ జడ్చర్ల, వనపర్తిలో అండర్–14, అండర్–17 హాకీ, అండర్–17 ఖోఖో, గద్వాలలో అండర్–17 క్రికెట్, అండర్–14, అండర్–17 విభాగం బాస్కెట్‌బాల్, అండర్–14 ఫుట్‌బాల్ రాష్ట్ర స్థాయి టోర్నీలు నిర్వహించనున్నారు.

త్వరలో జిల్లాస్థాయి సెలెక్షన్స్..



జిల్లాలో మండలస్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు చివరి దశకు చేరాయి. త్వరలో జిల్లాస్థాయిలో టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహిస్తాం. ఉమ్మడి జిల్లా క్రీడల షెడ్యూల్ కూడా రూపొందించాం. అందరి సహకారంతో జిల్లాలో రాష్ట్ర స్థాయి టోర్నీలను విజయవంతంగా నిర్వహిస్తాం.

– రమేశ్‌బాబు, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి, మహబూబ్‌నగర్

మండలస్థాయిలో మంచి స్పందన



మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలకు విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడల్లో పాల్గొన్నారు. మండల స్థాయిలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు జరుగుతున్నాయి. మండల స్థాయి జట్లు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయి.

– వేణుగోపాల్, ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి, మహబూబ్‌నగర్

తగ్గని ఉల్లి ధర...

- గరిష్టంగా రూ. 2660
- కనిష్టంగా రూ. 1800

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన ఉల్లి పాయల బహిరంగ వేలంలో ధరలు గత వారంతో పోల్చినపుడు నిలకడ ఉన్నాయి. రెండు నెలల నుంచి కొద్దికొద్దిగా ఉల్లి ధర పైపైకి పోతోంది. ఉల్లి సీజన్ అంతా రూ. వెయ్యిలోపే ఉన్న ధరలు ప్రతి వారం కొంత పెరుగుతున్నాయి. మార్కెట్‌కు పలు గ్రామాల రైతులు దాదాపు ఐదువందల బస్తాల ఉల్లి అమ్మకానికి తెచ్చారు. గత సీజన్‌లో పండించిన ఉల్లి ఇప్పటికీ కొందరు రైతులు నిల్వ చేసుకోవడం వల్ల మార్కెట్‌కు ప్రతివారం కొంత అమ్మకానికి వస్తోంది. సీజన్‌లో తక్కువ ధరలు రావడం వల్ల చాల మంది రైతులు ఉల్లిని పొలాల వద్ద నిల్వ చేసుకున్నారు. ప్రస్తుతం ధరలు బాగా వస్తుండడంతో అమ్మకానికి తెస్తున్నారు. వానాకాలం సీజన్ కింద వేసిన ఉల్లి మరో నెల తరువాత మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది కొత్త ఉల్లి అమ్మకానికి వస్తే ధరలు దిగివచ్చే అవకాశం లేకపోలేదు.



దేవరకద్ర మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన ఉల్లి

జోరుగా సాగిన వేలం....

మార్కెట్‌లో ఉల్లి వేలం పాటలు జోరుగా సాగాయి. స్థానిక, ఇతర మార్కెట్‌ల నుంచి వచ్చిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు. నాణ్యంగా ఉన్న ఉల్లికి బాగా డిమాండ్ ఉండడంతో ఏకంగా క్వింటాల్ ఉల్లి ధర గరిష్టంగా రూ. 2660ల వరకు పలికింది. ఇక రెండో రకం ఉల్లి కనిష్టంగా రూ. 1800 వరకు ధర వచ్చింది. వేలం తరువాత తూకం వేసిన 45 కేజీల ఉల్లి బస్తాను గరిష్టంగా రూ. 1300, కనిష్టంగా రూ. 900 వరకు విక్రయించారు. మార్కెట్‌లో వినియోగదారులతో పాటు చిన్న వ్యాపారులు ఎక్కువగా ఉల్లిని కొనుగోలు చేశారు. దేవరకద్ర సంతలో కిలో ఉల్లి పాయలు రూ. 30 వరకు విక్రయించారు.

ఏళ్లుగా.. నిరుపయోగంగా!

- జడ్చర్లలో వృథాగా ప్రభుత్వ భవనాలు, నిర్మాణాలు
- ఇప్పటికైనా వినియోగిస్తే మేలు

జడ్చర్ల: ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనాలు, ఇతర నిర్మాణాలు నిరుపయోగంగా మారాయి. 2006లో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం నిధుల లేమితో నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలేశారు. దశాబ్దం కిందట సిగ్నల్‌గడ్డ వద్ద మత్స్య కార్మికుల ఉపాధి నిమిత్తం షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ప్రస్తుతం ఇది ఎంత మాత్రం వినియోగం లేకుండాపోయింది. ఈ భవనం ఇప్పుడు రోడ్డు విస్తరణలో నేలమట్టం కానుంది. 15ఏళ్ల కిందట పద్మావతీ కాలనీలో కూరగాయల మార్కెట్ కోసం పనులు మొదలు పెట్టి పిల్లర్లు నిర్మించి అసంపూర్తిగా వదలేశారు. ఇప్పటికే దిష్టిబొమ్మలా పిల్లర్లు దర్శనం ఇస్తున్నాయి. ఇక 44వ నంబర్ జాతీయ రహదారిని అనుసరించి రెండు భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. దాదాపు రూ.2కోట్లకు పైగా నిధులు వెచ్చించి రైతు బజార్ నిర్మించారు. ఇక్కడ షెడ్లతో పాటు దుకాణ సముదాయం నిరుపయోగంగా మారింది.



అసంపూర్తిగా మహిళా సమాఖ్య భవనం



సిగ్నల్‌గడ్డ వద్ద నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

వినియోగిస్తే మేలు

ఆయా భవనాలు, అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేసి వినియోగిస్తే పలు కార్యాలయాలకు సౌకర్యంగా ఉంటుంది. ఇప్పటికే చాలా ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మున్సిపల్ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో కావేరమ్మపేటలోని పంచాయతీ భవనానికి మార్చారు. ఇక ఐసీడీఎస్, వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటికి ప్రతి నెల రూ.లక్షల్లో అద్దెలు చెల్లిస్తున్నారు. పట్టణ మహిళా సమాఖ్యకు భవనం ఇప్పటి వరకు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు, అధికారులు మేల్కొని ఆయా భవనాలను వినియోగించే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.